# ఆణిముత్యాలు

## కె.ఎన్.వై.పతంజలి

**1952** లో విజయనగరం జిల్లా అలమండలో జన్మించిన పతంజలి రచయితగా, జర్నలిస్టుగా తనదైన ముద్రవేసుకున్నారు. తెలుగు, ఆంగ్ల కాల్పనిక సాహిత్యాలను చదివి అర్థంచేసుకున్న మేథావి. ప్రారంభంలో రావిశాస్త్రి ప్రభావం, చాసో స్ఫూర్తి వున్నా క్రమేపీ పతంజలి స్వయంగా మార్గదర్శకుడైనారు. ప్రముఖ పత్రికలలో కీలకమైన హోదాలలో సమర్థవంతంగా పనిచేశారు. ''రాజుల లోగిళ్ళు'' ఆయన పూర్తిచేయని గొప్ప నవల. ''వీరబొబ్బిలి'' పతంజలి మేథకు మచ్చుతునక. ఆయన కథలు, వ్యంగ్య రచనలు పదునైనవి. పదికాలాలు నిలిచేవి. మొత్తంమీద తొమ్మిది నవలలు, రెండు కథా సంపుటాలు వెలువడ్డాయి. విస్తృతంగా రాయాలన్న చాపల్యం కంటే ప్రఖ్యాత రచయిల్ని చదివి ఆనందించాలన్నది ఎక్కువ ఇష్టం. 2009 మార్చి 11న పతంజలి నడివయసులోనే మరణించడం దురదృష్టం. ఈ కథ రచనా కాలం 1995. కె.ఎన్.వై.పతంజలికి అక్షరనివాళిగా ఈ కథని సమర్పిస్తున్నాం.

---

# పిలకతిరుగుడు పువ్వు

'అలమండ తగవు'లో తీర్పు చెప్పేసి మాజిస్ట్రేటు రిక్షా ఎక్కి వెళ్ళిపోయిన తర్వాత జామి పోలీస్‌స్టేషన్ సి.ఐ. స్కూటరెక్కి జామి పోలీస్‌స్టేషన్‌కి వచ్చేడు. అతని మనసు మనసులో లేదు. కొట్టీవచ్చు, సాక్ష్యం లేదనో, కేసు పకడ్బందీగా లేదనో, దొమ్మీ దొమ్మీగా, కంగాళీగా ఉందనో ఏ కేసైనా కొట్టీవచ్చు.

కానీ-

భూమి బల్లపరుపుగా ఉన్నాదని చెప్పడానికి వాడెవడు?

ఎవడువాడు-

జీవితం ఛండాలంగా ఉందనీ, చెప్పేదానికీ చేసే దానికీ పొంతన లేదనీ చెప్పడానికి ఎవడువాడు? ఎవుడాడు?

భూమే కాకుండా, జీవితం కూడా బల్లపరుపుగా ఉన్నాదని చెప్పడానికి వాడెవడు?

మనం ఏం చేస్తున్నాం?

చెప్పిందే చేస్తున్నాం!

ఎదురు మాటాడితే తంతానొరే- అని చెప్తున్నాం.

చెప్పిన రీతిగానే తంతున్నాం!

కేసు కింత తీసుకుంటాన్రా అంటున్నాం.

అంతే తీసుకుంటున్నాం!

కేసు మాఫీ జేస్తాం ఫలానీ ఇంత కావాల్రా అంటున్నాం. అదేదో తీసుకొని కేసు మాఫీ చేస్తున్నాం.

ఈ మన పోలీసు జీవితంలో అబద్ధానికి తావేమున్నాది?

దండం దశగుణం భవేత్ అని నమ్ముతున్నాం-

ఆ సూత్రాన్నే ఆచరణలో పెడుతున్నాం. నమ్మకానికీ- ఆచరణకూ తేడా లేదే. విశ్వాసానికీ, జీవితానికీ వ్యత్యాసం లేదే? మరి-

ఆ మేస్ట్రీటు పేలాపనేటి? చిరాకుగా టీ తెప్పించుకు తాగేడు, చిరాగ్గా సిగరెట్ వెలిగించుకు తాగేడు. టోపీ తీసి చిరాగ్గా దులిపి టేబిల్‌మీద పెట్టేడు.

- అలమండ రాజులు భూమి బల్లపరుపుగా ఉందని

అభిప్రాయపడ్డారు. అలమండ వెలలు భూమి గుండ్రంగా ఉందని అభిప్రాయ పడ్డారు. భూమి లాటీ లాగుందనీ, టోపీ లాగుందనీ మనం అభిప్రాయపడ్డాం. అదేవిధంగా భూమి బల్లపరుపుగుందని మేస్ట్రీటుగాడు నమ్మేడు. ఆడి నమ్మకం తీర్పయిపోయింది! మిగిలిన నమ్మకాలన్నీ గాలికి పోయినాయి.

ఇదేం న్యాయం?

నల్లగౌనేసుకున్నోడి నమ్మకం తీర్పయిపోయి, మిగిలోళ్ళ నమ్మకాలు విలువ లేకుండా ఎలాపోతాయి?

ఆలోచిస్తున్నకొద్దీ సి.ఐ.కి అసహనం పెరిగిపోయింది.

దీన్సంగతి తెల్సుకోవాలి!

ఇది మామూలు విషయం గాదు. దీన్నింత తేలిగ్గా వొదిలీడానికి వీల్లేదు!

ఇందులో ఏదో మత్లబ్ ఉన్నాది! మన బుర్రకి అందడంలేదుగానీ ఇందులో ఏదో డేంజరున్నాది.

మిగిలినలోకం సంగతి అలాగుంచితే మేస్ట్రీటుగాడి నమ్మకాన్ని మన పోలీసువారు కూడా తీర్పుగా అంగీకరించవలసి వస్తున్నాదంటే ఇది మామూలు సంగతి కాదు. లేచి నిల్చున్నాడతను.

❖ ❖ ❖

కోర్టులో నుంచి గేటు దగ్గరికి వచ్చిన పెదరాజును ముత్యాలనాయుడు పిలిచేడు.

ఇద్దరూ కొంచెం పెడగా నడిచిన తరువాత నిల్చుని-

''పెదబాబూ! ఆ మేస్ట్రీటు ఏటన్నాడో నాకు బోదపడ్లేదు. కేసు కొట్టేసినట్టు అనిపించిందిగానీ భూవి గుండ్రంగా నేదని ఆడు అన్నాడు గదా? అంటే మీ రాజుల వోదనే సరైందని తీర్పిచ్చినట్టే గదా? మరలాంటప్పుడు మమ్మల్నందర్నీ బొక్కల బెట్టమని చెప్పాలి గదా? మరిగంటే అలాగ్గాడ చెప్పలేదు. మమ్మల్నయిన బొక్కల బెట్టాల, నేదంటే మిమ్మల్నైన బొక్కల బెట్టాల, నేదంటే ఆ జామి పోలీసు నంజికొడుకుల్నయిన బొక్కల బెట్టాల. ఏటంటారు? కోరుటంటే ఆ అదాల్టీ ఉంటాది. కానీ, ఈడు అందర్నీ వొగ్గేసినాడు. ఒకరకంగ అదిగూడ మంచిదే అనుకోండి. మరైతే- భూమి గుండ్రంగానేదని తీరుపు ఎందుకిచ్చినాడు?'' అని ముత్యాలనాయుడు అడిగాడు.

పెదరాజు జేబులోంచి బర్కిలీ సిగరెట్టు పెట్టె తీసి, నాయుడికి ఒక సిగరెట్టిచ్చి తానొకటి వెలిగించుకున్నాడు. వెలిగించి, తాపీగా పొగలాగి-

''ఎందుకంటే- అలమండరాజులు ఏదైనా మాటంటే తప్పరని ఆడికి తెలుసు కాబట్టి. రాజుల మాట కాదంటే

## ఆ పలుకేవేరు

ప్రతి ఉదయం
పొడిచే పొద్దు లాంటి ఆ ముఖబింబాన్ని చూడందే
నాకు పొద్దు గడవదు.
తొలిజాములో అతని పలుకు
జిలుగునవ్వులతోనే.
మరి ఆ నవ్వుల్లో ఎంత పొదుపో.
ఉండి ఉండి ఓ అరనవ్వును ప్రసారం చేస్తాడు.
ఆ తర్వాత గొంతులోంచి చిమ్ముకొస్తాయి
అక్షరబిందువులు.
అన్నిటికంటే ముందుగా నిలిచేది ''బ''కారమే.
''బ'' అంటాడు
మాలోని అక్షరజ్ఞులు బాల్ తీసుకురావాలి.
మళ్ళీ ''బ'' అని ఆజ్ఞాపిస్తాడు బిగ్గరగా.
ఓహో అని బ్యాట్ తీసుకుపోవాలి.
ఇక మొదలవుతుంది అతని స్వచ్ఛంద బాల్యక్రీడ.
బాల్‌ను ఒక చేత్తో పైకెత్తి ఊర్ధ్వముఖంగా చూస్తూ
తాను భూగోళాన్ని పైకెత్తిన అనుభూతిని
పొందుతాడు.
అదే బాల్‌ను తనవైపు మెత్తగా విసిరితే
మనవైపు తెగబాది మెడ ఎత్తి చూస్తాడు.
బహుశః అది తన విజయానికి ఎక్కుపెట్టిన
పతాక అనుకుంటాడేమో.
ఈ క్రీడాకలాపం ఇలా సాగుతుండగానే
అతని దృష్టి
ఇంటి ముందటి రోడ్డు పైకి మళ్ళుతుంది.
''బ''కారం స్థానంలో ''బౌ''కారం ఆక్రమిస్తుంది.
పదే పదే పలుకుతుంది ఆ గళం ''బౌ బౌ'' అని.
కుక్కల పట్ల ఎంత మక్కువో ఆ ప్రాణికి.
అతని పాదం కదిలిందంటే పరుగే.
ప్రమాదమంటే ఏమిటో తెలియని పసితనం కదా.
అనుకున్నది వచ్చి తన ఎదుట వాలేదాకా
బిర్రబిగుసుకునే ఉంటాడు.
పట్టినపట్టు సడలించని గట్టి పిండం కదా.
జీవనరంగంలో జరిగే ధర్మ సమరంలో
అతడు తన పాత్రను ఇలాగే సమర్థంగా నిర్వహిస్తే
అమ్మమ్మ పెట్టిన పేరును
అక్షరాలా సార్థకం చేసుకుంటాడు.

డా॥ సి.నారాయణరెడ్డి

# జీవనవేదం

వంచివారికి / సన్మానపత్రమై / అక్షరాన్ని
ధారబోస్తాను
మకిలిపట్టినవారికి / విశ్వాసవచనమై / అక్షరంతో
శుభ్రపరుస్తాను
మట్టి బతుకులకు/ ఆశ్కారణమై / అక్షరాన్ని
పల్లవింపజేస్తాను
మానవరూప రాక్షసులకు / మరణమృదంగమై /
అక్షరధ్యానాలు వినిపిస్తాను
మతోన్మాదులకు / మానవతాగీతాన్నై / అక్షరాలతో
గానం చేస్తాను
మదాంధులకు / వెలుగు ఖడ్గాన్నై / అక్షరసాము
చేస్తాను
మంచికి పట్టాభిషేకంగా
ఆశవహ మంత్రంగా
అక్షర శ్లోకాలు చదువుతాను
చెడుకు చేతబడి చేసే / మాంత్రికుడనై
అక్షర గ్లీం...క్లీంలనుచ్ఛరిస్తాను
అక్షరంబు వలయు / కుక్షి జీవనులకు
పోతన్న జీవన వేదాన్ని వినిపిస్తాను.

*కిలపర్తి దాలినాయుడు*

గోచీ జారిపోతాదని తెలుసుకాబట్టి, ఈ కోర్టే కాదు ఇంకే కోర్టుకెళ్ళినా ఇంతే, ఒకటే మాట అడుగుతారు జడిజీగోరు... ఆదేవడుగు తాడంటే-

ముత్యాల్‌నాయుడేటన్నాడు? ఫలానీ లాగన్నాడు.
గ్రామస్థులందరేటన్నారు?
ఫలానీ మాటన్నారు!
పోలీస్ ఇనసుపెక్టరి ఏటన్నాడు?
ఫలానీ మాటన్నాడు!
మరింక
పెదరాజు గోరేటన్నాడు?
ఫలానీ మాటన్నారు! అపుడు ఆ జడిజీ ఏటంటాడు?
సెభాష్!! నాదీ అదేమాట... ఆ మారాజు చెప్పిన తర్వాత కూడా మీరీ కోరుట్లంట తిరగడం బుద్ధి తక్కువ పని. ఆయన్దో మాటా మా కోరుట్లంట ఇంకో మాటా ఉండదు. నోరు మూసుకు తిరిగి అలమండ చెలో అంటారు...!'' అన్నాడు పెదరాజు.

పెదరాజు చెప్పినది ముత్యాలనాయుడికి రుచించ లేదు. సిగరెట్టు పీలుస్తూ ఒక్క రెప్పపాటు కాలం ఆగి-

''మరైతే మేవిప్పుడు భూమి గుండ్రంగుందని వోదించకూడదా?'' అని అనుమానంగా అడిగాడు.

''మేస్ట్రీటు తీర్పిచ్చేసిన తర్వాత ఎలా వాదిస్తావు... వాదించి చూడు పిలకట్టుకుని ఏకంగా సెంట్రల్ జైలుకి పంపించేస్తారు...'' అన్నాడు పెదరాజు కోపంగా.

ముత్యాలనాయుడికి ఓపరానంత కోపం వచ్చింది గానీ ఆ సమయానికి ఏమీ తోచక నిశ్శబ్దంగా ఉండిపోయి పెదరాజు వైపు పులుకూ పులుకూ చూశాడు.

❖ ❖ ❖

జామి స్టేషన్‌లో కూర్చుని డి.ఎస్.పి. ఓపిగ్గా అల మండ దొమ్మీ కేసుమీద మాజిస్ట్రేట్ తీర్పు చదివాడు.

ఒకసారి పూర్తిగా చదివాక జేబులోంచి పెన్నుతీసి చేత్తో పట్టుకుని మళ్ళీచదివాడు. మళ్ళీ చదువుతున్న ప్పుడు కొన్ని వాక్యాల కింద పెన్నుతో గీతలు గీశాడు.

అతని ఎదరుగా సి.ఐ. కూర్చుని ఇదంతా చూస్తున్నాడు.

డిఎస్పీ మూడోసారి ఆ తీర్పు చదివి సి.ఐ. కేసి నిశితంగా చూశాడు. చూసి ముక్కు ఒకసారి గోక్కొని-

''ఏవోయి సర్కిలూ! నీ పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రజల యొక్క జీవితం ఛండాలంగా ఉన్నాదని మేస్ట్రీటు గారు చెప్తున్నారు... నిజవేనా?'' అని గద్దించాడు. సి.ఐ. బిత్తరపోయి వెర్రిచూపులు చూశాడు.

డిఎస్పీ తన పొట్టిముక్కుని మరోసారి గోక్కొని, సి.ఐ.కేసి పోలీసు చూపు ఒకసారి చూసి- 'విను' అని చదవటం మొదలుపెట్టాడు.

''మన జ్ఞానానికి సార్థకత లేదు, మన విశ్వాసాల మీద మనకు విశ్వాసం లేదు. మన విలువల మీద మనకు గౌరవం లేదు. మన దేవుడి మీద మనకు భక్తి లేదు. మన నాస్తికత్వం మీద మనకు నమ్మకం లేదు. మన మీద మనకు గౌరవం లేదు. మన తోటివాళ్ళ మీద మనకు మమకారం లేదు.మన ప్రజాస్వామ్యం మీద మనకు అవ గాహనగానీ, గురిగానీ లేదు. మన జ్ఞానానికీ, విశ్వాసానికీ పొంతన లేదు. విశ్వాసానికీ, ఆచరణకూ పొందికలేదు. భూమి బల్లపరుపుగా ఉన్నపుడు మాత్రమే ఇలాంటి జీవితం కళ్ళబడుతుంది, అని మేస్ట్రీటుగారు అలమండ

దొమ్మీకేసు తీర్పులో అన్నారు. విన్నావు గదా?'' అని అడిగాడు.

''చితం'' అన్నాడు సి.ఐ.

''అలమండ గ్రామం నీ పోలీస్‌స్టేషన్ పరిధిలోకే వస్తుంది గదా?''

''చితం''

''నీ అధికారనపరిధిలోని ఒక గ్రామంలో జీవితం ఇలా ఛండాలంగా ఉండడానికి బాధ్యత ఎవరిదో చెప్పగలవా?''

సి.ఐ, ఏమీ అనలేదు.

''పోలీసు అధికారులు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించితే వారి ఏలుబడిలో ఉండే గ్రామాల్లో జీవితం గుండ్రంగా ఉంటుంది కానీ అలా బల్లపరుపుగా ఉండదని నీవు ఎరుగుదువా?''

సి.ఐ. భయంగా లేచి నిల్చున్నాడు. ఎందుకైనా మంచిదని ఒక శాల్యూట్ కొట్టి-

''తమరు ఏటంటన్నారో నాకు అర్థంకావడంలేదు సార్'' అన్నాడు జంకుతూనే.

''పోలీసోడు సరింగుంటే ప్రజా జీవితం సరిగ్గుండా గద?'' డిఎస్పీ ఓపికగా అడిగాడు.

''చితం''

''మరి నీ రాజ్యములో ప్రజా జీవితము సవ్యముగా లేదుగదా? ప్రజలు ఇష్టారాజ్యముగా జీవించుచుంటే నీవు ఏమి చేయుచుంటివి?''

సి.ఐ. డిఎస్పీ కేసి బితుకూబితుకూ చూశాడు.

''నీవు నీ యొక్క విద్యుక్తధర్మమును సక్రమముగా నిర్వర్తించుటలేదని ఈ తీర్పు చివిన తరువాత నాకు అర్థము అయినది. ఇందులకు నీ సంజాయిషి ఏమిటి?''

సి.ఐ. బేరుమన్నాడు.

''సార్... సార్... పిల్లలు గలోడ్ని సార్... నా డ్యూటీ నేన్ కరెక్ట్‌గా చేస్తున్నాను సార్...''

''జీవితము గుండ్రముగా, భూమి గుండ్రముగా ఉండునటుల చూచుట మన పోలీసువారి బాధ్యత అని నీవు ఎరుగవా?'' అని డిఎస్పీ గద్దించి అడిగేసరికి సి.ఐ.కి నిజంగానే ఏడుపొచ్చింది.

కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడతను.

డిఎస్పీ సి.ఐ కేసి చూడడం మానేసి మాజిస్ట్రేటు తీర్పును మరోసారి చదివాడు. ఇంకొక్కసారి కూడా చదివి-

''మీ మేస్ట్రీటుగాడికి పిలక తిరుగుడు జాస్తిగా ఉంది... అందికే తీర్పు ఇలా గిచ్చేడు. భూమి గుండ్రంగా లేదు కాబట్టి జీవితం ఇలాగుందని నిర్ధారించి, భూమి బల్లపరుపుగుందని తీర్పిచ్చేడు. కాబట్టి ఇప్పుడు మనం ఏం చేయాలి?'' అని అతను కళ్ళు తుడుచుకుంటున్న సర్కిల్ని అడిగాడు.

''తమరే చెప్పాలి...''

డిఎస్పీ అపుడు మల్లెపూవు నవ్వు నవ్వేడు.

❖ ❖ ❖

''నమస్తండి. నేను న్యూస్ రిపోర్టర్ని'' అని తనని తాను పరిచయం చేసుకున్న ఆ కుర్రాడి కేసి అనుమానంగా చూశాడు పెదరాజు.

''న్యూస్ రిపోర్టరంటే ఏటి?'' ఆ కుర్రాడు కొంచెం సిగ్గుపడి, ''అంటే దినపత్రికల్లో వార్తలంయా రాసీవోడ్నండి... మాది జావి... దేంద్రోళ్ళ కుర్రోడ్ని...''

''అయితే ఏటిలాగొచ్చేవు?'' పెదరాజు సిగరెట్టు వెలిగిస్తూ అడిగేడు.

## చెప్పే దిక్కు ఏది?

మాచిన్నప్పుడు
సినిమాలకు వెళ్తే చెడిపోతావు
వెళ్ళకు బుద్ధిగా చదువుకో
అనే పెద్దవారు ఉండేవారు
ఇప్పుడు పిల్లలకు సినిమా
హాలుకు వెళ్ళే అవసరం లేదు
క్యూలో పడి టిక్కట్లు తీసే
ఇక్కట్లు లేవు
సినిమాలే ఇళ్ళకు వచ్చేసాయి
రిమోట్ నొక్కితే చాలు
ఎన్ని సినిమాలు ఎన్ని ఛానల్లు
ఏ ఒక్కటీ స్థిరంగా చూసే
స్థిమితం లేదు
పెద్దవారే చూడకుండా ఉండలేరు
మరి పిల్లలకు
చెప్పే దిక్కేది?

సింగిశెట్టి రామారావు

## లంచం

పడుకోవాలంటే... మంచం
పడిపోవాలంటే... లంచం

## నలకలు

నీళ్ళల్లో నలకలుంటే... వాటర్ ఫిల్టర్
నాయకుల్లో నలకలుంటే... వోటర్ ఫిల్టర్
ఒకటి వడగట్టేది
రెండోది పడగొట్టేది

## భ్రమ

మంచి కార్యక్రమంకోసం టి.వీ (ఆశగా) పెట్టడం

## శ్రమ

కొనా'సాగు'తున్న ఎపిసోడులు
ఏళ్ళతరబడీ చూడటం

బి.ఎం.పి.సింగ్

''అలమండ దొమ్మి కేసుమీద వోర్తరాద్దారనొచ్చినా నండి... మీరుగాని పాతిక రూపాయిలిచ్చారనుకొండి. ఇంత పిసరు సింగిలీకాలమ్ వోర్త ఏస్తానండి. హండ్రెడ్ రుపీసైతే బెత్తడు వోర్తండి. మరో యాభై ఇస్తే మీ ఫోటో కూడా పంపిస్తానండి... వోర్తతోబాటు అది పడితే పడా చ్చండి... నేపోతే నేదండి...''

''అసలేటీ ఇవ్వలేదనుకో అప్పుడేటి అవుతాది?'' అని చాలా కుతూహలంగా అడిగాడు పెదరాజు పక్కనే కూచున్న ఉప్పలపాటి చినబాబు.

ఆ ప్రశ్నకు రిపోర్టరు కుర్రాడు మళ్ళీ సిగ్గుపడి నవ్వేడు-

''పేపర్లో పేరు పడ్డవంటే శాలా గొప్ప విషయం గదండీ? మొత్తం జిల్లా జిల్లా అంతా మీ పేరు తెలిసి పోతాది. వందరూపాయల ఖర్చుతో అంత పేరు రావడ మంటే మజాకాలు కాదు కదండీ''

''కానీ...'' పెదరాజు చాలా తెలివిగా మొహం పెట్టి-

''కానీ... వార్తలు పంపడానికి పేపరోళ్ళు మీకు జీతా లిస్తారు గదా? ఒక పక్క జీతాల్దీసుకుంటూ, రెండోపక్క ఇలాగ డబ్బులుదీసుకోని వార్తలు పంపించడం తప్పుడుపని గాదా? పేపరోళ్ళే ఇలాగ తప్పుడు పన్లు జేస్తే లోకంల న్యాయం ఏటౌతాది? అది చెప్పు ముందు...'' అన్నాడు.

రిపోర్టరు కుర్రాడు వినయంగా నమస్కారం పెట్టి-

''నేను రిటైరైపోయిన తర్వాత ఖాళీచేసుకొని తమరి దగ్గిరకొస్తాను. అప్పుడా సంగతులన్నీ మాటాడుకుందాం. ప్రస్తుతానికి ఈ వోర్త సంగతి చూద్దావండి... మేస్ట్రీటగారు మీ వోదనే సరింగుందని చెప్పేరు... జీవితం సరింగా లేదు కాబట్టి భూమి ఊడా గుండ్రంగా లేదని ఆయనన్నారు... భూమి బల్లపరువుగా ఉన్నాదని కూడా ఆయన ఉద్ఘాటించారు.

ఐతే-

ఆయనకంటే ముందే మీ సంగతి చెప్పేరనీ, అందికే మీ ఊర్లో తగువైందనీ మాకు తెలియవచ్చింది. ఈ సంగతి మీకు ఎలా తెలిసిందో, మీరీ విషయాన్ని ఎలా కనిబెట్టేరో తెలుసుకొని, వోర్త పంపమని మాయాఫీసు నుంచి నాకు ఫోనొచ్చింది...'' అన్నాడు.

పెదరాజు ఏదో అనబోతుంటే ఉప్పలపాటి చినబాబు కలుగజేసుకున్నాడు.

''నువ్వా భోగట్ట తెలుసుకోడానికే వొచ్చావుగదా? మా దగ్గర్నుంచి సంగతులు తెలుసుకోడానికి నువ్వు వొచ్చి నపుడు నువ్వు మాకు డబ్బులియ్యాలిగానీ మేవెందు కిస్తాం?'' అని అతడు తర్కించేడు.

''మీరు మా దగ్గిరునంచి ఏటైన తెలుసుకోవాలన్నా, మాకు ఏదైనా చెప్పాలన్నా మేం మీ దగ్గిర్నించి ఏటైనా తెలుసుకోవాలన్నా, మీకేదైనా చెప్పాలన్నా మీరే మాకు డబ్బులియ్యాలండి. న్యూసు రిపోర్టరికి ఆ అథార్టి ఉన్నాది కాబట్టే నేనీ ఉద్యోగం జేస్తున్నాను.... మీరోవరో గానీ నాతో అనవసరంగా వితండం జేస్తన్నారు... నును పెదరాజుగోరి ఇంటర్వ్యూకోసం వొచ్చాను... ఇస్తే ఇవ్వ మనండి... లేకపోతే లేదు... నేను రాయవలసిందేదో నే వ్రాసేస్తాను...'' అని నిమ్మళంగానే అన్నాడు.

''నువ్వూరుకోవోయ్ చినబాబూ... పేపరోళ్ళతో గొడ వొద్దు.... అతనడిగిన దానికి పెదబాబు సమాధానాలు చెప్పేడమే మంచిది. చెప్పినట్టు పేపర్లో వొస్తాది... లేదంటే గొడవ....'' అని పెద జోగులు రాజుగారి పెదబాబు హితబోధ చేశాడు.

''మీరు చెప్పింది చెప్పినట్టొచ్చేస్తే మావందరం ఎందుకండి? విపుడు మీరు జెబుతారు. నాకు బోధపడి నట్టు నేను రాసి పంపిస్తాను. మా పేపర్లో సబ్ ఎడిటర్లని ఉంటారండి, ఆళ్ళు నే రాసింది చదివి ఆళ్ళకి బోధపడి

నట్టు ఆళ్ళు తిరిగి రాస్తారండి. చీఫ్ సబ్బులని ఉంటా రండి. ఆళ్ళు దాన్ని సదివి తవకి బోధపడినట్టు దిద్దు తారండి. ఆయెనక ఆ కాయితాలు కంపోజింగ్‌లోకి ఎల్తా యండి. అక్కడ ఆళ్ళకెలాగ బోధపడితే అలాగ కంపోజ్ చేస్తారండి.... అబ్బో శానా తతంగం ఉందండి... మేం రాసిందే రాసినట్టు అచ్చవడం గగనం. వింక మీరు సెప్పింది సెప్పినట్టు ఎలాగొస్తారండి...? ముందే సెపు తున్నాను. ఆ తరువాత నిష్టూరాలెందుకు?'' రిపోర్టరు కుండ పగలేసినట్టు అది నిష్టూరాన్ని కోరుకున్నాడు.

ఒక్క క్షణం నిశ్శబ్దం తరువాత పెదరాజు ఆ కుర్రవాడికి కూర్చోవడానికి కుర్చీ చూపించేడు.

❖ ❖ ❖

''డబ్బులు కరుసైనా ఫర్వాలేదు. పావలాకీ, బేడకీ జంకీవోడు కాడీ ముత్తేల్ నాయుడు... జేగర్తగ వైడియ జేసి, మన కేసుల దమ్ముందా? అప్పీల్ చేసుకోవచ్చునా? అప్పీల్జేస్తే గెలుస్తావా? అసలు అప్పీల్ జేసుకోకుండ ఉంటే ఏటౌతాది? ఇయ్యన్నజెప్పు... పట్టుదలగా అడిగాడు ముత్యాలనాయుడు.

శృంగవరపు కోటనుంచి ప్రత్యేకంగా విచ్చేసిన తాడి మోహనరావునాయుడు, అనే ప్లీడరు ముత్యాలనాయుడు ఎదురుగా కూర్చున్నాడు- ముత్యాలనాయుడు చెప్పిం దంతా నిశ్శబ్దంగా విని-

''నాయుడుగారూ! అరగంట నుంచి మరు చెప్పిన దంతా విన్నాను... విన్నందుకు నా ఫీజు వంద రూపా యలు. ముందా డబ్బులు ఇచ్చీయండి'' అన్నాడు మోహన్‌రావు నాయుడు.

''నాన్జెప్పింది ఆలకించడానికి వొంద రూపాయ లుచ్చుకుంటావా? మరైతే మాట్లాడ్డానికి ఎంత అడుగు తావు? సలా చెప్పడానికి ఎంతుచ్చుకుంటావు?'' బెదిరి పోయి అడిగాడు ముత్యాలనాయుడు.

''ఆ వివరాలన్నీ చెప్పడానికి మరో పాతిక రూపాయ లివ్వాలి'' షరతు పెట్టాడు ప్లీడరుగారు.

ముత్యాలనాయుడు ప్లీడరీకి ఆగమని సౌజ్ఞ చేసి లేచి బైటికొచ్చాడు.

గది బైట అతని పరిజనమంతా వేచి ఉన్నది.

''ఓరీ బంగారీ...''అని తమ్ముడ్ని పిలిచాడు. వచ్చాడు తమ్ముడు.

''ప్లీడర్ని దెమ్మంటే పీక్కు తినీవోడ్ని దెచ్చినారు... ఆడి మొగం జూస్తే దమ్ముల గొండు నాగుంది. మా జూస్తే జలగవోటం నాగుంది... ఆడు ఒచ్చినాక ఉప్పుడుదాక మూడే మూడు ముక్కలు మాటాడ్నాడు... డబ్బు లియ్యి, డబ్బులియ్యి, డబ్బులియ్యి... ఈ మాటలు దప్పించి ఆ పీడర్నంజికొడుకు మరేటీ అన్లేదు... కానేటిజేస్తాం? అవసరం మన్ది... ఏటైతే అదే అవుద్ది... మనోల్లందరికాడ తలో వందాదండు... ఎంత కరుసైనా మనం ఉప్పడు జంకడానికి వీల్లేదు... నానిప్పుడు నా జోబీలోంచి ఆ పీడర్ నంజికొడుక్కి వెయ్యి రూపాయిలు అడమాన్సిస్తన్నాను'' అని చెప్పేసి మళ్ళీ లోపలికొచ్చాడు ముత్యాలనాయుడు.

ప్లీడరుగారి ఎదురుగా మళ్ళీ కూర్చుని జేబులో నుంచి ముందో వంద రూపాయల కాగితం తీసి ప్లీడరుకు ఇచ్చాడు. తర్వాత మరో పాతిక రూపాయిలిచ్చాడు.

ఆ డబ్బులు తీసుకుని ప్లీడరుగారు జేబులో పెట్టుకున్నారు. ''నాయుడు గారూ....ఇందాక మీరు చెప్పినదాన్లో కొన్ని విషయాలు నాకు సరిగ్గా అర్థంకాలేదు. మొదటి నుంచి మళ్ళీ మరోసారి చెప్తారా?'' అని గంభీరంగా అడిగాడు.

## నా - ఆవేదన

ఎవ్వరి మీద కోపము
పైవాడికి పెట్టకు దోషము
అనుభవించేది జీవితము
క్షణికావేషముతో పొందకు మరణము
ఎవ్వరి వ్రాతలు వారివి
విధాతచే కూడి వున్నవి
మన కర్మలలో ఉన్నవి
ఫలితమ్మై ఎదురుచూస్తున్నవి
నీ ఆప్రాణం నీకు భారమ్మైతె
శాంతి సౌఖ్యాలు దూరమ్మైతె
పిల్లల భవిష్యత్తె అందకారమ్మైతె
అందర్ని కడతెర్చకు చట్టం తెలిస్తే
మందులున్నవి రోగాలకు
మనసులున్నవి మానులకు
స్పందించె హృదయాలున్నవి సంస్థలకు
త్వరపడిపోయరెందుకు పైలోకాలకు

లింగర్‌కర్ దయానంద్

## ఎదురైన గమ్యం

నిలబడ్డాను
నిలబడ్డాను
బుర్రగోక్కున్నాను
జుత్తు పీక్కున్నాను
ఇలా కాదని...
ఆవులించాను
చిటికవేశాను
నిద్రనటించాను
నిట్టూర్చాను
అబ్బే!...
పళ్ళునూరాను
పిల్లిమొగ్గలేశాను
పగలబడినవ్వాను
దీపస్తంభానికి తలబాదుకున్నాను
ఇకలాభంలేదని...
కాళ్ళు మూడించాను
నడక సాగించాను
నాకెదురౌతూ
నా గమ్యం

*మల్లాప్రగడ రామారావు*

''మళ్ళీ చెప్పడానికి కూడా డబ్బులుచ్చుకుంటారా?'' భయంగా అడిగాడు ముత్యాలనాయుడు.

''మరో హండ్రెడ్ రుపీస్ ఓన్లీ! మీరు చెప్పడానికి కాదు. మీరు చెప్పింది నేను వినడానికి. మీరు సరిగ్గా చెప్పకపోయినా మీకే నష్టం. నేను సరిగ్గా వినకపోయినా మీకే నష్టం కాబట్టి ముష్టి డబ్బుల కోసం ప్రలోభపడి కేసు పాడు చేసుకోకండి...'' డబ్బుల కోసం చేయి చాపుతూ సలహా చెప్పేడు ప్లీడరు.

లోపలే తిట్టుకుంటూ ముత్యాలనాయుడు మరో వంద రూపాయలు ప్లీడరుకు ఇచ్చాడు. ఇచ్చి కేసంతా మళ్ళీ చెప్పేడు.

అంతా సావధానంగా విని, ''పోలీసులు పెట్టిన కేసును దొమ్మీకింద తేల్చి కొట్టేసేడు... ఈ కేసులో అంతకంటే ఇంకేటి లేదు. భూవి ఎలాగుందని నిర్ణయించుకునే హక్కు మీకున్నాది. కాబట్టి మీ ఇష్టవొచ్చినట్టు వాదించండి. ఎవడన్నా కాదంటే బుర్ర పగలకొట్టేసి నాక్కబురుపెట్టండి. మిగిలిన సంగతి నేన్జూసుకుంటాను... పై కోర్టుకు పోవాల్సిన అవసరం మనకైతే లేదు...'' అని సలహా చెప్పి ప్లీడరు గారు చిరునవ్వు నవ్వి-

''ఈ సలహా చెప్పినందుకు నా ఫీజు రెండున్నర వేలు, పై కోర్టుకు పోయి డబ్బులు చెడ ఖర్చుపెట్టి, సెడిపోకుండా కాపాడినందుకు మరో రెండువేలు. మొత్తం నాలుగున్నరవేలు ఇచ్చేస్తే నేను సెలవు పుచ్చుకుంటాను'' అని కూడా చెప్పేడు.

''అంత డబ్బులంటే ఇప్పటికిప్పుడు నేవండి నాయుడు గోరూ... తవురు ఎస్.కోట వెళ్ళిపోండి.... రేపు మాపిటికల్లా నేను డబ్బులు పంపుతాను...'' అన్నాడు ముత్యాల నాయుడు మొహం గంటు పెట్టుకొంటా.

''నాకు వేరే కేసులేయీ లేవులెండి... మీరు సొమ్ములిచ్చిన తరువాతే వెళ్తాను... ఒకటి రెండు రోజులు లేటైనా ఫర్వాలేదు'' అన్నాడు తాడి మోహనరావునాయుడు.

❖ ❖ ❖

భూమి గుండ్రంగా లేదుః
మాజిస్ట్రేటు తీర్పు

ఎస్.కోట, నవంబర్ 12ః భూమి గుండ్రంగా లేదని, అది బల్లపరుపుగా ఉన్నదని స్థానిక మాజిస్ట్రేటు కోర్టువారు నేడు ఒక తీర్పులో ఉద్ఘాటించారు. అలమండ గ్రామంలో నవంబరు పదకొండో తేదీన జరిగిన ముఠాతగాదాల కేసును దొమ్మీ కేసు కింద కొట్టివేస్తూ, ముద్దాయిలందర్నీ విడుదల చేస్తున్న సందర్భంగా మాజిస్ట్రేటు శ్రీ గంగాధరం ఈ సంచలన తీర్పును ప్రకటించారు.

జామి పోలీస్ స్టేషన్ పరిధిలోని అలమండ గ్రామ ప్రజలు కులాలవారీగా రెండు ముఠాలుగా చీలిపోయి, భూమి గుండ్రంగా ఉన్నదని ఒక వర్గం భావించడం మొదలుపెడితే, కాదు బల్లపరుపుగా ఉన్నదని రెండవ వర్గం భావించింది. ఆ విధంగా మొదలైన మనస్పర్థలు ముదిరి హింసాకాండ చెలరేగే పరిస్థితి ఉత్పన్నం అయింది. ఆ పరిస్థితిలో జామి పోలీసుస్టేషన్ అధికారులు సమయస్ఫూర్తిగా కలుగజేసుకుని ఎలాంటి వివక్షా లేకుండా రెండు వర్గాలవారినీ పిలకబట్టుకుని

## అద్దం

ప్రతీ దాన్నీ
భూతద్దంలో చూడక!
అలా అని భూతద్దాన్ని
పారేయకు...
అనుకోకుండా అవకతవకల్ని
మనకదే చూపిస్తుంది!
అదే యాదృచ్ఛికంగా!!

శైలూషి

నిర్భందంలోకి తీసుకుని, మాజిస్ట్రేటు కోర్టులో దొమ్మీ నేరంమీద, హింసాకాండ రెచ్చగొట్టిన ఆరోపన మీద కేసు దాఖలు చేశారు.

కేసు ఇచారించిన మాజిస్ట్రేటు శ్రీ గంగాధరం కొత్త తరహాలో విశ్లేషణ చేశారు. జీవితం అస్తవ్యస్తంగా, నమ్మకాలకూ, ఆచరణకూ పొంతన లేకుండా అబద్ధాల మయంగా ఉన్నది. కాబట్టి, జీవితమే బల్లపరుపుగా ఉన్నది కాబట్టే అలమండలో ఇలాంటి తగువు జరిగిందనీ, ఆయన భావించారు. భూమి గుండ్రంగా లేదని అర్థమనీ ఆయన తర్కించి, భూమి బల్లపరుపుగా ఉన్నదని తీర్పు చెప్పారు. ఘర్షణకు దిగిన రెండు వర్గాల వారినీ ఆయన వెంటనే విడుదల చేశారు.

ఆ వార్త మొత్తం రెండుసార్లు చదివాడు డిఎస్పీ.

తరువాత అదే పేజీలో పడిన 'పెదరాజు ఇంటర్వ్యూ' కూడా చదివాడు. అది ఇలా ఉంది.

భూమి బల్లపరుపుగా ఉంది:
ఆకాశం గుండ్రంగా ఉంది
అలమండ పెదరాజు అభిప్రాయం.

జామి, నవంబర్ 12 : పై శీర్షికలో ఉద్ఘాటించిన విధంగా భూమి బల్లపరుపుగా ఉందని కోర్టువారు అంగీకరించడంవల్ల అలమండ శ్రీ కాకర్లపూడి పెదబాపి రాజు అనే శ్రీ పెదరాజుగారు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆకాశం కూడా గుండ్రంగా ఉన్నదని కోర్టు వారు గుర్తిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

గ్రామంలో ఉన్న రాజకీయకక్షలకూ, కులవైషమ్యాలకూ అతీతంగా ఆలోచించి శ్రీ ముత్యాలనాయుడి వర్గం కోర్టువారు కూడా అంగీకరించిన వాస్తవాలను అర్థం చేసుకోవాలనీ, భూమి గుండ్రముగా లేదని తెలుసుకోవాలనీ, ఆకాశం గుండ్రంగా ఉన్నదని గ్రహించాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు. సత్యాన్నీ, వాస్తవాన్నీ నిరూపించడం కోసం ప్రాణాలకు సైతం తెగించి పోరాడుతున్న తమ వర్గంపై జామి పోలీస్ అధికారులు జులుం చేయడంపై శ్రీ పెదరాజు నిరసన వ్యక్తం చేశారు. ఇరవయ్యో శతాబ్దం ఆఖరయిపోవస్తున్న ఈ రోజుల్లో కూడా పాత నమ్మకాలనే పట్టుకు వేలాడుతున్న తమ ప్రత్యర్థివర్గం పట్ల ఆయన సానుభూఇ వ్యక్తం చేశారు.

డిఎస్పీ మొహం కందగడ్డలాగ అయిపోయింది. దానికిందే ఉన్న మరో వార్త అతని దృష్టిని ఆకర్షించింది.

ప్రజల విశ్వాసాల్లో కోర్టు జోక్యం శోచనీయం

ఎస్.కోట, నవంబర్ 12 : ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రజల విశ్వాసాలపై న్యాయస్థానాల జోక్యం అనుచితమనీ, అనర్థదాయకమనీ జామి పోలీస్ స్టేషన్ పరిధిలోని అలమండ గ్రామ వాస్తవ్యుడూ, సమితి అధ్యక్షుడూ శ్రీ లగుడు ముత్యాలనాయుడు వాక్రుచ్చారు. ఇటీవల తమ గ్రామంలో తమ రాజకీయ, కుల వర్గానికీ, తమ ప్రత్యర్థి వర్గానికీ భూమి ఆకృతిపై కలిగిన అభిప్రాయ భేదాలు శృతిమించి కోర్టుకు ఎక్కినపుడు ఎస్.కోట మాజిస్ట్రేటు తమ వర్గంవారి విశ్వాసాలను కొట్టిపారవేశారనీ, తమ ప్రత్యర్థివర్గం అభిప్రాయమే సరైనదని మాజిస్ట్రేటు తీర్పు చెప్పారనీ శ్రీ నాయుడు వివరించారు.

అలమండలో తమ ప్రత్యర్థులతో వివాదం మొదలైనపుడు తాము భూమి గుండ్రంగా ఉన్నదని వాదించినామనీ, కోర్టువారు భూమి బల్లపరుపుగా ఉన్నదని తీర్పు చెప్పారనీ వివరించి, 'ఈ క్షణం నుంచీ భూమి మూడు

## సూర్యచంద్రులు

అతడు
నా నుదుట
వెలిగే సూరీడు...!
నేను
అతని గుండెల్లో
ఒదిగే చందమామను...!!

పెరుగు సుజనారామం

గుర్రాల వారుక్కా బీడిలాగ ఉన్నాదని తాము విశ్వసిస్తున్నామనీ' శ్రీ నాయుడు ఉద్ఘాటించారు. తమ విశ్వాసాలకు అనుగుణంగా, ఇతరులకు హాని చేయకుండా జీవించే హక్కు తమకు ఉన్నదనీ, మాజిస్ట్రేట్లు, పోలీసువారూ, జిల్లా జడ్జీలు కూడా ఈ హక్కును కాలరాయలేరని శ్రీ నాయుడు స్పష్టం చేశారు.

ఈ మూడు వార్తలూ చదివి డిఎస్పీ కత్తెర తెప్పించుకొని వాటిని జాగ్రత్తగా కత్తిరించి తెల్లకాగితం మీద అంటించాడు.

సి.ఐ. రాగానే వాటిని అతనికిచ్చి, ''చూడవోయ్... ఆ పిలక తిరుగుడు మేస్ట్రీటు ఎంత పెంట పెట్టాడో'' అన్నాడు. టేబుల్ మీద కత్తెర తీసి పట్టుకుని-

''దీన్తో వాడి పిలక కత్తిరించేస్తాను-'' అని కూడా అన్నాడు.

❖ ❖ ❖

కోర్టుకు బయలుదేరే ముందు మేజిస్ట్రేటు గంగాధరం కూడా ఆ వార్తలు చదివాడు- ఏం పత్రికలో... సారాంశాల్ని తప్పించి మిగిల్నివన్నీ రాస్తారు- అని కొంచెం అసంతృప్తి వ్యక్తం చేశాడు కూడా.

బెంచ్‌మీద కూర్చుని తొలికేసు చూశాడు.

లంజముండలకేసు.

## నానీలు

కన్న తల్లి
కన్నీటి వ్యధ
కడలిలోని బీభత్సపు
తుఫాను రొద

సైన్సుకు లెక్కలకు
తెలియనిది..........
మనసుకే తెలిసేది
గుండెలోగగగ

పుడమి తల్లికి
పులకరింత తొలకరితో
తల్లికి
తొలిచూలుతో

డా॥ అడుపాల సుజాత

జుల్మానాతో సరిపెట్టేసేడు.

రెండోది- సినిమాహాల్లో బ్లాక్ మార్కెటింగ్ అభియోగం. కేసు పెట్టిన పోలీసువాడే డబ్బులు తినేసినట్టుంది. కేసు బలంగా లేదు. సాక్ష్యం సరింగ లేదు. తేలిపోయింది కేసు.

మూడోది పొలంగట్టు తగువులో చేతికర్ర దుర్వినియోగం. ఫిర్యాదీకి చేయి విరిగింది.

స్వల్ప జుల్మానా, స్వల్ప శిక్ష.

లంచ్ అవర్లో ఇంటి నుంచి తెచ్చుకున్న పెసరట్లు, ఉప్మా తిని వాలుకుర్చీలో ఓ పదినిమిషాలు నిద్ర జేసేడు.

అప్పుడు వినిపించింది కోలాహలం. జవాన్ను పంపించి వివరాలు తెలుసుకున్నాడు.

జామి పోలీస్‌స్టేషన్నించి మరో కేసు. అలమండ మనుషులేన్ట, మరో కేసుట.

మధ్యాహ్నం బెంచ్ ఎక్కిన తరువాత కేసు వివరాలు చదివి తెల్లబోయాడు.

ముద్దాయిలు : సమితి ప్రెసిడెంటు వగైరా పాతికమంది.

నేరారోపణ చేసినది జామి సర్కిల్ ఇన్స్‌పెక్టర్.

నేరం : కోర్టు ధిక్కారం.

అలమండ దొమ్మీకేసులో కోర్టువారు భూమి గుండ్రంగా లేదని తీర్పు చెప్పినా ముద్దాయిలు ఒప్పుకోవడం లేదట. పైగా భూమి మూడు గుర్రాల బీడీలాగున్నాదని కొత్త వివాదం లేవదీసేరట. ఫలితంగా గ్రామంలో మళ్ళీ ఉద్రిక్తవాతావరణం నెలకొనే ప్రమాదం ఉందిట.

సాక్ష్యాధారాలు పేపరులో ముత్యాలనాయుడి ప్రకటన. ముద్దాయిలు పోలీసులతో కూడా అదే కోర్టు ధిక్కారపు ప్రకటనలు చేస్తున్నారట. కోర్టులో కూడా అలాగే చేస్తారుట.

ముద్దాయిల్ని ప్రవేశపెట్టమన్నాడు. మొన్న చూసిన పాచి మొహాలే. కొందర్ని పేర్లతో సహా పోల్చాడు గంగాధరం.

ఒక్క ముత్యాలనాయుడ్ని మాత్రం బోనెక్కించి అడిగాడు.

''నీమీద, నీ అనుచరులమీదా కోర్టు ధిక్కారం నేరం పడింది... భూమి బల్లపరుపుగా ఉన్నదని కోర్టువారు చెప్పిన తీరుపను నువు ధిక్కరించి గ్రామంలో ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నావని పోలీసులు ఆరోపిస్తున్నారు... దీనికి నువు చెప్పుకొనేదేమైనా ఉందా?''

ముత్యాలనాయుడు భయపడుతున్నవాడిలాగ లేదు.

## ఊహల పిట్టలు

గుండె గూటిలో
ఊపిరి పోసుకున్న
ఊహల పిట్టలు
మాటల రెక్కలు తొడుక్కుని
పెదాల దారి గుండా
బయటకు ఎగిరొస్తాయి
ఆటిల్లో కొన్ని
అంద చందాలను ఒలికిస్తూ
మధుర స్వరాలను వినిపిస్తూ
మనో రంజన చేస్తాయి
మానవత్వాన్ని చూపుతూ
మరి కొన్ని
ముక్కులతో పొడుస్తూ
కాళ్లలో రక్కుతూ
హృదయం మీద దెబ్బతీస్తాయి
కర్కశత్వాన్ని చాటుతూ

**జి.నీలకంఠం**

పెంకెగానే తల ఎగరేసి, ''మా ఊరి రాజు లేమాటంటే కోర్టువారు అదే రైటన్నప్పుడు మాం కోర్టువోర్ని ఎందుకు గౌరవించాలి మారాజా?'' అని అతను తల తిరుగుడుగా అడిగాడు. గంగాధరానికి మరి వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం కనిపించలేదు. కేసు పెట్టిన పోలీసు సి.ఐ. వైపు తిరిగి-

''ఒక్కో ముద్దాయిచేత కోటిసార్లు భూమి బల్లపరుపుగా ఉన్నది అని రాయించి ప్రతిమాటకూ సంతకం పెట్టించు, ఇది నీ సొంత అజమాయిషీలో, మీ ఇంట్లో జరగాలి. వాళ్ళంతా అలా రాసేవరకూ వాళ్ళని నీ సొంత బాధ్యత మీద నీ ఇంట్లో నిర్బంధించాలి. వాళ్ళ బోయినం ఖర్చులు వాళ్ళే పెట్టుకోవాలి. వాళ్ళ దగ్గర ఖర్చులు తీసుకుని ఆ బోయినం ఏర్పాట్లు నువ్వే చేయాలి'' అని ఆర్డరు వేశాడు.

మాజిస్ట్రేటు పెట్టిన పేచీ సి.ఐ. చటాలున గ్రహించాడు. ''యస్సర్... కానీ, ముద్దాయిలకు చదవడం, రాయడం రాదు'' అని ఎదురెత్తు వేశాడు.

మాజిస్ట్రేటు చిరునవ్వు నవ్వాడు. ''ముద్దాయిలకు చదవడం, రాయడం రాకపోతే వాళ్ళ బదులు నువ్వు మరియు నీ కింది సిబ్బంది కాగితాల మీద నేను చెప్పినట్టు కోటిసార్లు రాసి, ప్రతివాక్యం కిందా కోటిసార్లు ముద్దాయిల చేత నిశానీ వేయించండి...'' అనేసి మాజిస్ట్రేటుగారు ఆ కేసుమీద తన ఆర్డరు రాసేసి తరువాత కేసు పిలిచీమన్నాడు.

❖ ❖ ❖

తెల్లవారురఝామున రెండు గంటలైంది. వీధి తలుపులు దబదబ ఎవరో బాదుతుంటే గోపాత్రుడికి మెలకువ వచ్చింది. దొంగలేమోనని కంగారుపడ్డాడు. కానీ, దొంగలు తలుపులు కొట్టిరారని గుర్తుకువచ్చింది. ఎందుకైనా మంచిదని ఓ కర్ర తీసి కుడిచేతిలో సిద్ధంగా పట్టుకుని, ఎడమచేత్తో తలుపు తెరిచాడు. తలుపు తీసిన అతని మొహం మీద నాలుగు బ్యాటరీల టార్చిలైటు పడింది. ''ఎవురది?'' అని పిరికిగా అడిగాడు గోపాత్రుడు.

''భయపడొద్దు... పోలీసోళ్ళు...'' అని వినిపించింది.

''పోలీసులా? వింత రాతిరప్పుడు ఎందుకు వొచ్చారు?'' అని గోపాత్రుడు సందేహం వెలిబుచ్చాడు.

''భారతదేశమండలి ప్రజాస్వామ్యవ్యవస్థను నాశనము చేయుటకు నీ నాయకత్వములో అలమండ గ్రామములో ఒక పెద్దకుట్ర జరిగినది... నీవున, మీ ఫకీర్రాజునూ, నీ భార్యయగు సింవాచలం అను మహిళయూ, ఫకీర్రాజు భార్య అగు చిట్టెమ్మయునూ మరియీ మీ ఇంటిలో ఉన్న బొబ్బిలియునను కుక్కయునూ ప్రధాన కుట్రదారులైయున్నారు. కుట్రకేసు సందర్భముగా మిమ్ములను నిర్బంధములోనికి తీసుకొనుచున్నాము'' అని వినిపించింది.

పోలీసువారి ప్రకటనలో వనిపించిన పేర్లు తప్ప గోపాత్రుడికి మరేమీ అర్థంకాలేదు.

❖ ❖ ❖

కేసు నంబరుః ఫలానీ

కేసు స్వభావముః చట్టబద్ధముగా ఏర్పడిన భారత గణతంత్ర వ్యవస్థను కుట్ర పూరితముగా కూల్చివేయుటకు కుత్సితబుద్ధితో ముద్దాయిలు పన్నిన పన్నాగము.

ఆరోపణలకు ఆధారభూతమైన ఐపిసి సెక్షన్లుః

నిందితులుః మచిలీపట్నం గోపాత్రుడు ఎ1

ఈ సింహాచలం ఎ2

ఉప్పలపాటి ఫకీర్రాజు ఎ3

ఈ చిట్టెమ్మ ఎ4

ఇంటిపేరు లేని బొబ్బిలి అనే గ్రామసింహము లేక కుక్క ఎ5

కేసు దాఖలు చేసినవారు: భారత ప్రభుత్వము తరపున వారి ఘనత వహించిన ప్రతినిధులు, విశాఖ పట్నం జిల్లా, శృంగవరపుకోట తాలూకా జామి పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టరువారు.

కేసు వివరములు: స్వస్తిశ్రీ చాంద్రమాన కాళయుక్తి నామ సంవత్సర ఆశ్వయుజ మాసం శ్రీ ద్వితీయ యుగ ఇదావత్సర (1) వక 1906 కలిగతం 5078 ఫసలీ 1386-4 ఆశ్వయుజ తదియకు సరియగు అక్టోబరు నెల 22వ తేదీన అనగా కృత్తికా నక్షత్రయుక్త కుంభలగ్నమందు (ఆ దినము అట్లతద్ది మరియు గౌరీవ్రతము కూడాను) నింఇతులు ఎ-1 గారి ఇంటిలో రహస్యముగా సమావేశమై దేశమునందు మూఢనమ్మకములు వ్యాప్తిజేసి, నిదానముగా దేశమునందు నెలకొన్న సకల శాస్త్ర విజ్ఞా, సాంకేతిక జ్ఞానమునూ నిర్మూలించి, తత్ఫలంగా ఏర్పడిన గణతంత్ర రాజ్యమును నిర్మూలించి కలియుగారంభ కాలమందున్న రాచరిక వ్యవస్థను పున: ప్రారంభించాలనే దుష్ట సంకల్పముతో కుట్ర చేసినారు. ముందస్తుగా భూమి బల్లపరుపుగా ఉందన్న వాదన వ్యాప్తి చేసినారు. అదే గ్రామమందున్న పురోగామి వర్గాన్ని శస్త్రాస్త్రములతో నిర్మూలించడానికి అలమండ గ్రామం, శిరికిపాలెం శివార్లలోనున్న సంతబయలున ఒక మాదిరి యుద్ధాన్ని కూడా నిర్వహించ తలపెట్టినారు. కానీ, విధివశాన, ధర్మకర్మాచరణ దీక్షా కంకణ బద్ధులైన, పోలీసు వంశ వయ: పారావార రాకాసుధాకరులైన శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ డిఎస్పీ దొరగారి పరోక్ష నేతృత్వములో వారి ప్రధాన సేనాపతియనబరగు శ్రీశ్రీశ్రీ సర్కిల్ ఇన్స్పెక్టర్ మాధవరావు నాయుడు గారు అను నేను మేలుకాంచి ఆ యుద్ధమునూ, రక్తపాతమునూ నివారించితిని. తాదారభ్యా నిందితులపై ఒక కన్నువేసి వారిని సదా కనిపెట్టి ఉండి ఈ కేసు దాఖలు చేసే పర్యంతమూ మాసిన బట్టలు విప్పక, మాసిన గడ్డము గీయక దీక్ష వహించితిని. భగవంతుని దయవలన నేటికి శ్రీవారికి ఈ కేసు నివేదించగలిగితిని. మా గ్రామ దేవతయగు శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ నూకాంబికాదేవి సత్యమూర్తియగు నేని నేను చేసిన సకల ఆరోపణలూ సక్రుత్తుగా నిరూపించగల వాడను.

ఇందుక్కు సాక్షులు: సాక్షాత్ శ్రీ మహావేమ్మరు సమానధీరులైన, మహాన్యాయకోవిదులైన మాజిస్ట్రేటు శ్రీ గంగాధరంగారూ, 'కంగాళీ' దినపత్రిక జామి న్యూసు కంట్రిబ్యూటర్గారూ,

సమితి ప్రెసిడెంటుగారైన శ్రీ లగుడు ముత్యాల నాయుడు గారూ, అలమండ గ్రామస్థులు అసంఖ్యాకులునూ.

మొత్తం అంతా చదివిన మాజిస్ట్రేటు గంగాధరానికి చర్మం కింద చెమటపోసింది. కోర్టులో నిలబడ్డ ముద్దాయిల్ని జాలిగా చూసి, "కేసు సోమవారం నాటికి వాయిదా వేస్తున్నాను. అందాకా ముద్దాయిలక పోలీసు రిమాండు" అన్నాడు.

సి.ఐ. చిరునవ్వు నవ్వి, "కోర్టు ధిక్కారం కేసులో ముద్దాయిల నిశానీలు కోటికి కోటీ ఉన్నాయని తమరు నిర్ధారించుకున్నారా సార్?" అని ఎద్దేవాగా అడిగాడు.

"ఉన్నాయున్నాయి" అన్నాడు గంగాధరం గాభరాగా.

గోపాత్రుడ్నీ, ఫకీర్రాజు ప్రభృతులనూ పోలీసులు తీసుకుపోయినాక మాజిస్ట్రేటు మనసు కొంచెం కుదుటపడింది.

జామి సి.ఐ. కూడా యబటకు వెళ్ళిపోయాడు.

## కచ్చా? దోస్తా?

నీ కోసం
పుట్టిన పుష్పం
పుష్కర కాలం
వికసిస్తుందా?
కాప్పులోకో
కోవెల్లోకో
చేరాలి కదా!
నీ కోసం
వచ్చిన బాష్పం
నయనంలో
నిలుస్తుందా?
నాలోకో
నేలలోకో
ఇంకాలి కదా!

ప్రేమలో
ఊపిరి నీ కోసం
విడవాలంటుంది
నా హృదయం
పొద్దు నీ కోసం
పొడవాలంటుంది
ఈ ఉదయం
కచ్చీ! దోస్తో!!
అంతగా అడగాలా?
కారుణ్యమో
కాఠిన్యమో
నీ కళ్ళను చూస్తే
తెలిసింది.

సి హెచ్. ప్రకాశ్

ఎస్.కోట పోలీసులు పెట్టిన న్యూసెన్సు కేసు పరిష్కరించేసరికి- జామి సి.ఐ. మళ్ళీ ప్రత్యక్షం అయ్యాడు. రొంగలి బజ్జీ, తవమ్మన్న, సన్యాసి, చినఅప్పలస్వామి మొదలైన పదహారుమందిని కోర్టులోకి పోలీసులు తీసుకొచ్చారు.

''ఇదేవిటి?'' గాబరాగా అడిగాడు మాజిస్ట్రేటు గంగాధరం.

''చిత్తం... దీని పేరు రొంగలివారి కుట్రకేసండి...'' అన్నాడు జామి సి.ఐ. వినయంగా.

''ఇదేం కుట్ర?''

''చట్టబద్ధముగా ఏర్పడిన ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థను సాయుధ పోరాటము ద్వారా కూలద్రోసి, రొంగలి వంశ సామ్రాజ్య స్థాపనకు ఈ నిందితులైన రొంగలి బజ్జీ, రొంగలి అమ్మన్న ప్రభృతులు పన్నిన కుట్ర''

''ఇందాకటి కుట్ర కేసుక్కూ, దీనికీ తేడా ఏవిటి?''

''పోలికలు చాలా ఉన్నా ఉద్దేశాల్లో తేడా ఉన్నాది కాబట్టి ఈ కేసు ఏరాగా కట్టినాం...'' సి.ఐ. వినయంగా చెప్పాడు.

ఈ కొత్త కేసుకు సంబంధించిన కాగితాలు మొత్తం చదవడానికి గంగాధరం సాహసించలేకపోయాడు. ఇందుక్కు సాక్షులు మాత్రం అలవోకగా చూస్తే అందులో కూడా తన పేరు ప్రముఖంగా కనిపించి- ''సరే ఈ కేసు కూడా సోమవారానికి పోస్టు చేస్తున్నాను. ముద్దాయిలకు అందాకా రిమాండు''

సి.ఐ. చాలా వినయంగా సెలవు పుచ్చుకుని ముద్దాయిల్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

గంగాధరానికి చర్మంపైన కూడా పిసరంత చెమట పోసినట్టు అనిపించింది.

పోలీసుల మొగాల్లోనూ, పోలీస్ ప్రాసిక్యూటర్ మొగంలోనూ, బెంచ్ క్లర్కు మొగంలోనూ ఏదో ఒక కుట్రలాంటిది అతనికి లీలగా అగుపించింది. జేబురుమాలుతో నొసలు అద్దుకుంటుండగా జామి సి.ఐ మళ్ళీ మరికొంతమందిని తీసుకుని కోర్టు హాలులో ప్రవేశించాడు.

వస్తూనే అతను కేసు కాగితాలు సమర్పించాడు.

''ఇదేం కేసూ?'' అతి భయంగా అడిగాడు మాజిస్ట్రేటు.

''ఇదీ అలమండ గ్రామానికి సంబంధించినదేనండి. కజ్జపు వీధి కుట్ర కేసండి... నిందితులందరూ పగలు మిఠాయిలూ, పకోడీలు అమ్ముకుంటూ, రాత్రివేళ దేశాన్ని ఖండఖండాలుగా విచ్ఛిన్నం చేయడానికి సంబంధించిన కుట్రలు చేస్తున్నారండి... ముందు అలమండ గ్రామాన్ని రెండుగా విడగొడ్తారండి. తరువాత జామి మండలాన్ని రెండు కింద విడగొట్టేస్తారండి. ఆ తర్వాత జామి పోలీస్టేషన్ని రెండు ముక్కలు చేసేస్తారండి. ఆ యెనక జిల్లా అండి. ఆ తర్వాత దక్షిణ భారతదేశవండి. తర్వాత యావత్ ఇండియాను రెండు కింద విడగొట్టేస్తారండి. అదండి కుట్ర. అయితే, ఇంకా కుట్ర ముదిరిపోక ముందే మేం పట్టేసేం గాబట్టి మరేటీ బయ్యం లేదండి. ముద్దాయి (ఒకటో నంబరు) గాజుల పాపయ్య మొదట భూమి గుండ్రంగానే ఉన్నాదని వాదించాడండి. తర్వాత ఊరులో రెండో అభిప్రాయం కూడా ఉన్నదని గ్రహించి, అర్ధరాత్రివేళ తన ఇంటిలో ఒక రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేశాడండి. ఆ సమావేశానికి తక్కిన ముద్దాయి

## లచ్చమ్మ రానందట!

లచ్చమ్మ రానందట
బుచ్చిగానింటికి
నే లుచ్చునా...?
బచ్చునా...!?
అని...

లడ్డాయికెళితే
నీ జోలెలో
నను దాయవు
జొనుపుతావు
ఊక దోసిటిని
నీవుండేది
ఊరుబయట
గుడిసె వేస్తావు గుండ్రంగా
గుర్రుకొడతావు ఆనందంగా
ఈరోజు ఈ చోట
రేపు మరోచోట
చోటు లేదు
నీచోట, అందుకే కాబోలు...

మల్లెపాక సాంబయ్య

లందరూ హాజరయ్యారండి. రామకోవెలలో భూమి గుండ్రంగా ఉందా, బల్లపరుపుగా ఉన్నదా అని బయలు దేరిన కాలక్షేపవు వివాదాన్ని ఆసరా చేసుకుని ఊరిలో కక్షలు రేసి, కులాల మధ్య చిచ్చుపెట్టి హింసా ప్రయోగం అవసరమయ్యే స్థాయికి వైరుధ్యాలు విజయవంతంగా పెంచారండి. ఈ విషయాలన్నీ తమకి నాకంటే బాగా తెలుసండి. మొన్న అలమండ కేసు విచారణ సందర్గా చాలామంది తమకి ఈ వివరాలు చెప్పేరండి. అందుకే తమ సాక్ష్యం కూడా మేం కోరతామండి...'' జామి సి.ఐ. అతి వినయంగా నటిస్తూ చెప్పాడు.

గంగాధరం నీరసంగా ఆ కాగితాలు అందుకొన్నాడు.

హాలులో బోను దగ్గిర పోలీసు వలయంలో నించున్న గాజుల పాపయ్య వగైరాలు పులుకూపులకూ చూస్తున్నారు.

గంగాధరం జామి సి.ఐ. కేసి చూసి, ''ఒక్కరోజులోనే మూడు కుట్ర కేసులు మోపిన ఘనత నీకే దక్కిం దయ్యా'' అన్నాడు వెక్కిరింతను దాచేస్తూ.

''చితం వరల్డ్ రికార్డేనండి. అయితే, మూడేం ఖర్మండి... ఇంకా దిగువీధి కుట్ర కేసున్నాదండి, మాల పేట కుట్ర కేసున్నాదండి, తాటితాళ్ళ కుట్ర కేసుందండి, పెదచావిట్లో రాజుల కుట్రకేసు వేరేగుందండి... సాక్ష్యాలు కూర్చడం పూర్తయితే సోమవారానికి మరో నాలుగు కుట్రకేసులు రెడీ అయిపోతాయండి... తమరికి కూడా పెద్ద పబ్లిసిటీయండి... ఈసారి పెద్ద ప్రమోషనే...''

''ఎవరికి?'' కటువుగా అడిగాడు గంగాధరం.

''చితం. నాకేనండి'' మాట మార్చాడు సి.ఐ.

## కూరుకు కోరలొచ్చాయ్!

కన్నీళ్ళు తిరుగుతున్నాయ్! ఉల్లినేకాదు ఏ కూరతరిగినా!

జేబులో డబ్బులూ తరుగుతున్నాయ్!!

వెజిట'బుల్స్'కు కొమ్ములొచ్చి జనాన్ని కుమ్ముతున్నాయ్!

ధరల కోరలు పెంచి నాన్ వెజ్‌లుగా మారి జనాన్ని కొరుక్కుతింటున్నాయ్!!

**యమ్వీ అప్పారావు**

## విజ్ఞప్తి

ఆస్తికులకు, నాస్తికులకు
ఓ విజ్ఞప్తి
దేవుడున్నాడో లేడో తెలియదు
కాని
దైవత్వం మాత్రం ఉంది
స్పందించే హృదయాల్లో

**పీవీఎల్**

''ఈ కేసుని కూడా సోమవారానికి పోస్టుచేసి, ముద్దాయిలను రిమాండులో పెట్టు'' అనేసి గంగాధరం వాచీ చూసుకుంటూ కుర్చీలోంచి లేచిపోయాడు.

❖ ❖ ❖

''ఏటయ్యా బాబూ... ఏటిదంతా?'' నిస్సహాయంగా అసిస్టెంట్ పోలీస్ ప్రాసిక్యూటర్‌ని అడిగాడు మాజిస్ట్రేటు గంగాధరం.

''ఏటని మీరడిగితే సార్, ఏటి జెప్పేది సార్...? ఇది పోలీసుమాయ... గవర్నమెంటోడి లీల... అంతకుమించి నేనేటి చెప్పేది'' అని అడిగి ఏ.పి.పి. నిట్టూర్చాడు.

''నన్ను సాక్షిగా వేసేస్తే... నేనీ కేసుని విచారించ కూడదు కదా?''

''యస్సర్''

''ఇంకొకడు విచారిస్తే నేను బోనులో నిలబడి సాక్ష్యం చెప్పాలి గదా?''

''చితం!''

మాజిస్ట్రేటు ఏమీ మాటాడలేదు. ''ఇందులో ఏ ఒక్క కేసు విచారణకు అడ్మిట్ అయినా మీరు ఇరుక్కుంటారు గదా సార్?'' నెమ్మదిగా అడిగాడు ఏ.పి.పి.

అదిరిపడ్డాడు మాజిస్ట్రేట్. ''ఎలాగ?''

''ఎలాగంటే, అలమండ కేసులో భూమి బల్లపరుపు గున్నాదని తమరు తీర్పిచ్చారు... తీర్పు తర్వాత భూమి బల్లపరుపుగా లేదని వాదించిన అలమండ గ్రామస్థులు కొందరికి మీరు కోర్టు ధిక్కార నేరం కింద శిక్ష కూడా విధించారు...'' మిగిలినది వివరించనక్కరలేదని ఏ.పి.పి. గుంభనంగా ఊరుకున్నాడు.

''ఒక్క కుట్రకేసైనా నిలబడదు...'' కక్షగా అన్నాడు గంగాధరం.

ఏ.పి.పి. నవ్వేడు- ''కుట్రకేసులునిలబడతాయని పోలీసులు వాట్ని పెడతారా సార్? అల్లరి పెట్టడానికి పెడతారు. ఆ మనుషులు పెట్రేగిపోకుండా కొంత కాలమైన కంట్రోల్‌లో ఉండటానికి పెడతారు. పిరికి వాళ్ళని జడిపించడానికి పెడతారు...''

మాజిస్ట్రేటు చిరాగ్గా జుత్తంతా చెరుపుకున్నాడు.

ఏ.పి.పి. లేచి నిల్చున్నాడు. ''సెలవిస్తే నేను తర్వాత తమ దర్శనం చేసుకుంటాను'' అయోమయపు చూపులు చూస్తూ గంగాధరం తలూపాడు.

❖ ❖ ❖

''అందరొచ్చినట్టేనా?'' సి.ఐ. చిరునవ్వు నవ్వుతూ అడిగాడు.

''అందరొచ్చినట్టేనండి. 'కంగాళీ' వోడుదప్పు... ఆడికి జొరంగుంది... అందరి కేద్దైన ఇస్తే ఆడిది నా సేతికిచ్చి పంపమన్నాడండి... మీకు ప్రత్యేకంగా చెప్పమన్నాడు...'' 'సువార్త' కంట్రిబ్యూటర్ సుబ్బరాజు అన్నాడు.

రాష్ట్రంలోని అన్ని దినపత్రికలకూ జామి, ఎస్.కోట ప్రాంతాల విలేఖరులుగా పనిచేస్తున్న నవయువకులం దరూ ఆ సమయంలో జామి సి.ఐ. ఇంటి వరండాలో కుర్చీల్లో సుఖాసీనులై ఉన్నారు.

ఎదురుగా ఉన్న రెండు టాపాయ్‌లమీద 'పోలీసు జవాన్లు' మందూ మాకూ అమర్చుతున్నారు.

''ఏటండి ఇసేసం? ప్రమోషన్ గొడుతున్నారేటి?'' 'దుర్వార్త' పత్రిక విలేఖరి రమణ కాకా నవ్వు నవ్వుతూ అడిగేడు.

''ప్రమోషన్‌గాదు ఏంగాదు? ఈవేళ శనివారం గదా? సరదాగా జర్నలిస్టులతో కాస్ ఖుషీగా ఉందావనిపించింది... అంతే...'' అన్నాడు సి.ఐ. లేచి అందరికీ తలో గ్లాసుడు విస్కీ అందిస్తూ, ఛీర్లయినాక, ఓ పెగ్గు గొంతుల్లోకి దిగినాక-

''ఇవాల్టి ముఖ్యావార్తలేవున్నాయి'' అని చాలా అమాయకంగా అడిగాడు సి.ఐ.

''అన్నిటికంటే పెద్ద వోర్తమీదే గదండి... ఒక్కరోజున అన్ని కుట్రకేసులంటే పెద్దవోర్తే గదా...'' సువార్త పత్రికా విలేఖరి ప్రశంసాపూర్వకంగా గ్లాసు పైకెత్తి పట్టుకొని చెప్పేడు.

సి.ఐ. నవ్వేడు- ''అదేం వార్తండి... అసలది వార్తే కాదు... అలాంటివి మీరసలు మీ పత్రిక్కి పంపకూడదు. మనందరం ఎప్పుడ్నించో ఫ్రెండ్స్ కాబట్టి నా రిక్వెస్టు.... ఆ వార్త ఎవరూ పంపకండి... మా డిఎస్పీగారు కూడా రిక్వెస్టు చెయ్యమన్నారు. ఒక చిన్న గ్రామంలో అన్ని

## అమలినం

గుర్తొచ్చేను 'మైదానం'లో అమీనా
కృ.శా.గారి ఊర్వశి తాన తందానా!
అబ్బురపరిచే అరిశల జనవరి
నిలువక పారేను ప్రేమ గోదావరి!!
ఉబుసుపోని నాయుడు బావలకు
ఎగసన దోసే(చే) ఎంకి మాలచ్చులకు
శాపం తొలగిన కాలమిదే
మోక్షం పొందే తరుణమిదే!
సాగితే శృంగార ఏరువాకం
అందేను కదా అందని నాకం
అయితే ప్రేమతో మమేకం
'ఇహ'లోకం అంతా అమరైక వేద్యం

పొన్నం శ్రీను

కుట్రలు జరిగిపోతున్నాయని తెలిస్తే మా ఎస్పీగారు బాధపడతారు... వారికి ఆమధ్య స్ట్రోక్, అంటే గుండెపోటు కూడా వొచ్చింది... తట్టుకోలేరు''

దుర్వార్త విలేఖరి గ్లాసు ఖాళీచేసి, సి.ఐ. ముందు పెట్టి- ''మీరు పంపొద్దంటే... ఎవరు సార్ పంపేది...? మీ మాట మేం ఎప్పుడైనా కాదన్నామా? ఎవరూ పంపరు... మా యందర్దీ ఒకటే మాట... మీతో కలిసి మనందరిదీ ఒకటే మాట...'' అన్నాడు.

''సి.ఐ.గారూ... గ్లాసుల్లో మందు పొయ్యడానికి ఒక కానిస్టీవును పెట్టండి. మందు సంగతి మీరు జూసుకోండి... ఆ జబ్బు సంగతి మాం జూసుకుంటాం...'' 'కల్పన' దినపత్రిక విలేఖరి వీరాచారి అన్నాడు.

''జబ్బా? ఏం జబ్బు?'' సి.ఐ. అనుమానంగా అడిగాడు.

''సర్దాకన్నానండి... జబ్బంటే మీర్జెప్పిన వార్త అని నా అభిప్రాయం. ఈ మందుపడితే ఆ జబ్బు తగ్గిపోతాదని నా ఐడియా...'' వీరాచారి వివరించాడు.

సి.ఐ. చిరునవ్వు నవ్వి, ''ఒకవేళ ఎవరైనా ఇప్పటికే పంపించేస్తే ఆ సంగతి చెప్పండి... అన్ని పత్రికల్లోనూ

మన ఫ్రెండ్సున్నారు... మానేజ్జేసుకుంటాం...'' అన్నాడు.

పెద్ద పెద్ద దినపత్రికల్లో పనిచేసి 'కారణాంతరాలవల్ల' ప్రస్తుతం చిన్న పత్రికలో పనిచేస్తున్న వృద్ధుడూ, ఆ ప్రాంతపు యువ జర్నలిస్టులకు గురువూ అయిన గణపతి రావు పకపక నవ్వేడు- ''లేదండీ... వార్త నేను ఇంకా రాయనేలేదు...''

## పేగుబంధం

నువు కడుపున పడినంతనే...
మాతృత్వపు మమకారాన్ని-
అమృత తుల్యంగా భావించి
జన్మ సాఫల్యంగా ఎంచి
జాగురూకతతో 'గర్భ' గుడిని కాచి
నవమాసాలూ మోసి...
నఖశిఖ పర్యంతం వేదన పడి
జీవన్మరణంలాంటి పురిటినొప్పులను
జీవిత పరమార్థంగా అనుభవించి,
అలసి, సొలసి, వ్యధాభరితమై సొమ్మసిల్లి
నిన్ను ఈ లోకమనే వాస్తవంలోకి...
అపురూపంగా తీసుకొచ్చిందే 'అమ్మ'
నువ్వు కన్ను తెరిచింది మొదలు...
తాను కన్ను మూసే వరకూ...
తన అనురాగపు పొత్తిళ్ళలో
వాత్సల్యపు వాకిలిలో...
లాలించి, పాలించేదే 'అమ్మ'
నీ ఆటపాటలతో ఆనందించి...
నీ చదువు సంధ్యలతో అభినందించి...
నీ జీవితకాలపు బడికి మొదటి గురువై...
నీ భవిష్యత్ కాలపు మనుగడకు మార్గదర్శియై...
దివ్యమైన అమృతనపు కమ్మని ఒడిగా నిలిచేదే ఈ
ప్రేమ బంధం
తరుగుతూ కరుగుతూ దివ్వెగా వెలుగుపంచేదే ఈ
పేగుబంధం!!

తాతోలు దుర్గాచారి

## రైతన్న

నీ
చెమట బిందువు
తాకకుండా
నేల తల్లి పులకించదు
నీ
చేతి స్పర్శ
సోకకుండా
ఏ విత్తూ మొలకెత్తదు.

కొమ్మోజు శ్రీధర్

''మీరు సరేనండీ... వీళ్ళెవరైనా...''

''ఈ కుర్రవెధవల్లో సగంమందికి రాయడమే రాదు. ఏ వార్త అయినా నేను రాస్తే ఈళ్ళందరూ నకళ్ళు దీసుకు పంపుతారు... మీకు ఇంతవరకూ తెలీకపోతే ఇపుడైనా తెల్సుకోండి...''

''ఏవండోయ్... రాయడం రాదంటే వార్తలు మాత్రమే రాయడం, చదవడం రాదనుకుంటే మాకు నామర్దా... రాయడం రానోడు జర్నలిస్టు ఎలాగైనాడని సి.ఐ.గోరు మళ్ళీ వండరైపోగ్రలు'' 'సువార్త' సుబ్బరాజు కంగారుపడ్డాడు.

''నాకు అన్నీ తెలుసునండీ... దేనికీ ఆశ్చర్యపోను... ఆ వార్త మీ పత్రికల్లో రాకపోతే నాకు అదే పదివేలు... హెడ్డాఫీసుల్లోనే వార్తలు రాయడం రానివాళ్ళు అనేక మంది హాయిగా బతికేస్తున్నారు... జీతాలైనా సరిగ్గా అందని స్ట్రింగర్లూ, కంట్రిబ్యూటర్లూ ఎలాగుంటే ఏటొచ్చింది?''

❖ ❖ ❖

కుట్రకేసులకు సంబంధించిన కాగితాలూ, కేసు వివరాలూ సెషన్సు కోర్టుకు పంపించి, అన్ని కేసుల్లోనూ తననూ సాక్షిగా పేర్కొన్నారు. కాబట్టి వాటిని పరిశీలించి, కాగ్నిజెన్స్ ఉన్నదా లేదా అని నిర్ధారించడం తనకు సముచితం కాదని భావిస్తున్నాననీ, ఏలినవారు తగు నిర్ణయం తీసుకొని వాటిని వేరే మాజిస్ట్రేటు పరిశీలనార్థం పంపవచ్చునని గంగాధరం రాశాడు.

వారం రోజుల తర్వాత సెషన్సు కోర్టు నుంచి అతనికి పిలుపొచ్చింది. సోమవారం నాడు పదిగంటలకు తన సముఖాన ఉండాలని సెషన్సు జడ్జి ఆదేశించాడు.

❖ ❖ ❖

''ఈ నేరాల్ని పరిగణనలోకి తీసుకోవాలో లేదో నేను స్వయంగా పరిశీలిస్తాను...''

''ఎస్ మిలార్డ్...'' గంగాధరం తల ఊపాడు.

ఓ అరగంటసేపు సెషన్స్ జడ్జీ ఆ కాగితాల్ని చూసి- గంగాదరాన్ని దగ్గరకు రమ్మని పిలిచాడు. పిలిచి- ''ఒకవేళ కుట్ర కేసంటూ పెడితే నీమీదే పెట్టాలని నాకు అనిపిస్తున్నదయ్యా'' అన్నాడు మంటగా.

గంగాధరానికి గొంతు పెగల్లేదు. అలమండ కుట్ర కేసులో మాజిస్ట్రేటుగా అతనిచ్చిన తీర్పు ప్రతి కుట్రకేసు లోనూ పోలీసులు ముఖ్యమైన పత్రంగా వాడుకున్నారు. సెషన్సు జడ్జి ఆ కాగితాలు ఓసారి పరీక్షగా చదివి-

''ఒక న్యాయాధికారిగా నీ పరిధులు, పరిమితులూ ఏమిటో తెలియకుండా ఇలా ఎంతాలం నుంచీ ఉద్యోగం చేస్తున్నావు'' అని గద్దించాడు. గంగాధరం ఏమీ అనలేకపోయాడు.

''కేసు వివరాలు చూడాలి. సాక్ష్యాలు చూడాలి, పోలీసు అభియోగాలు చూడాలి, అంతేనా? ఇంకా ఏమైనా చూడాలా?'' జడ్జి మళ్ళీ గద్దించి అడిగాడు.

''ఎస్ మిలార్డ్‌షిప్''

''మరి నువ్వు ఆ పరిధిని దాటి జీవితం వైపు ఎందుకు తొంగిచూశావు?''

గంగాధరం దగ్గిర సమాధానం లేదు.

''నో... యూ హేవ్ ఎక్సీడెడ్ యువర్ లిమిట్స్...'' చూపుడువేలు ఆడిస్తూ కోపంగా చెప్పేడు సెషన్స్ జడ్జి.

''పోలీసులు కేసు పెట్టారు. కేసు వివరాలన్నీ రాశారు. సాక్షులున్నారు... కొట్లాట జరిగింది.... ఇరుపక్షాల వారి పైనా పోలీసులు నేరారోపణలుచేశారు... అవునా కాదా?''

''ఎస్ మిలార్డ్''

## ఒకే తాటిమీద

**మృ**త్యుఘోష ఒకవైపు
పెళ్లి పేరంటాల
ఆర్భాటం మరోవైపు
సమాజమే ఒక నాణెం
లాంటిది.
పలు ప్రక్రియలకు చేయూత
నిచ్చే వరంలాంటిది.

**జి.శ్రీశైలం**

''ఎస్! మరి అటువంటప్పుడు జీవితం ఎలాగుందో, ప్రజలెలాగున్నారో, భూమి ఎలాగుందో నీకెందుకు? అటువంటి విషయాలతో కోర్టువారి సమయాన్ని, పోలీసు వారి సమయాన్నీ, ప్రభుత్వము వారి స్టేషనరీని ఎందుకు వృధా చేయవలసి వచ్చింది?''

గంగాధరం దగ్గిర ఈసారి అసలు సమాధానం లేదు, కోర్టంతా కలయజూశాడు. జామి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మందస్మిత వదనంతో హాలులో ఒక కుర్చీలో వినయంగానే కూర్చుని ఉన్నాడు.

''ప్రజాజీవితం పోలీసువారి చేతుల్లో సుఖంగా, శాంతంగా, చల్లగా ఉందని, భూమి ఒకవేళ బల్లపరుపుగా ఉన్నా కూడా పోలీసువారు దాన్ని తమ చేతుల్లోకి తీసుకొని పిండిలాగ నలిపి, గుండ్రంగా చేయగలరనీ నేను నమ్ముతాను... మున్సఫ్ మాజిస్ట్రేటుగా నీ నమ్మకం కన్నా సెషన్స్ జడ్జిగా నా నమ్మకానికి ఎక్కువ విలువుంటుంది గదా. అప్పుడేమంటావు?''

జామి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సంతోషంగా చప్పట్లు కొట్టి, ''ఒన్స్‌మోర్'' అని అరిచాడు.

సెషన్స్ జడ్జిగారు ఆ ప్రార్థనను మన్నించి ఆ మాటలు మరోసారి అదేస్థాయిలో అన్నారు. గంగాధరం బిత్తరపోయాడు.

''ఇంకెప్పుడూ ఇలాగ పిచ్చిపిచ్చిగా పరిదులు దాటగూడదని హెచ్చరిక చేస్తున్నాను. జీవితంవైపు తొంగిచూసినట్లుగాని, ఆఖరికి దొంగచూపు చూసినట్టుగానీ తెలిసిందా నీ పిలక కత్తిరించేస్తాను. ఏకంగా పట్టుకు తన్నేస్తాను. తెలిసిందా?'' సెషన్సు జడ్జి అడిగాడు. గంగాధరం తల ఊపాడు.

''కేసులు పరిష్కరించు, అదీ నీ పని. జీవితాన్ని పరిష్కరించే బాధ్యత మనది కాదు...'' అని గంగాధరానికి హితబోధ చేసి సెషన్స్ జడ్జిగారు కుట్రకేసుల కట్ట అందుకున్నాడు.

జామి సి.ఐ. తటాలున లేచి, ''మైలార్డ్... ఆ కుట్రకేసు లన్నీ మేం ఉపసంహరించుకుంటున్నాం.సార్... మేస్ట్రీటు గారికి తమరు చేసిన హితబోధలో మా పోలీసుల శక్తిసామర్థ్యాలు ఏపాటివో చెపుతూ, ఆ సంగతి తమరు మాకు కూడా గుర్తు చేశారు. భూమినే అవసరమైన రీతి లోకి మలచగలిగిన మాకు అలమండ గ్రామస్థులు ఒక లెక్క కాదు. వాళ్ళ సంగతి మేం మామూలుస్థాయిలోనే చూసుకోగలం... తమ విలువైన కాలాన్ని వేస్ట్ చేయదలచుకోలేదు...'' అన్నాడు.

సెషన్సు జడ్జి చిరునవ్వు నవ్వేడు. ■